ఇందిరాపార్కు మూసివేత

● హిందుత్వ సంఘాల ఆందోళన నేపథ్యంలో పార్కును మూసివేసిన పోలీసులు

మూసుకున్న ఇందిరాపార్క్ ప్రవేశద్వారం

సందర్శకులు రాకపోవడంతో బోసిపోయిన ఇందిరాపార్క్

కవాడిగూడ, ఫిబ్రవరి 14: సందర్శకులు, ప్రేమ జంటలతో ప్రతిరోజు సందడిగా కనిపించే ఇందిరాపార్కు ప్రేమికుల రోజు (వాలెంటైన్స్ డే) సందర్భంగా శుక్రవారం బోసిపోయింది. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వైపు ఉన్న గేటుతోపాటు రామకృష్ణ మఠం ఎదురుగా ఉన్న మరో గేటుకు సైతం పోలీసులు తాళాలు వేయించి మూసివేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే వాలంటైన్స్ డే సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పార్కును మూసివేశారు. వాకర్స్ కోసం ఉదయం ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు తెరిచి ఉంచిన పార్కును అనంతరం బంద్ చేశారు. పార్కు మూసివేసి ఉండడంతో కుటుంబాలతో, పిల్లలతో వచ్చేవారితో పాటు ప్రేమికులు నిరుత్సాహానికి గురయ్యారు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు మూసి ఉన్న పార్కును చూసి వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చింది. ప్రేమికుల రోజును వ్యతిరేకించే విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులతో పార్కుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఇందిరా పార్కు మూసివేసినట్లు దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రేమికుల రోజు సందర్భంగా పార్కుకు వచ్చే ప్రేమ జంటలకు వీహెచ్‌పీతోపాటు బజరంగ్ దళ్ నాయకులు కార్యకర్తలతో ఇబ్బందులు తలెత్తకూడదని ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: ఉస్మానియా యూనివర్సిటీలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) 3, 5, 7 సెమిస్టర్ల మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్డ్ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 బ్యాచ్‌లకు చెందిన బ్యాక్లాగ్ అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

ఆర్థిక సమస్యలతో ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 14: ఆర్థిక సమస్యలతో వైద్యం చేయించడంలో నిర్లక్ష్యం వహించవద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో బల్కంపేటకు చెందిన రాజేశ్వరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.75 లక్షల ఆర్థిక సహాయం మంజూరు పత్రం (ఎల్వోసీ) బాధితురాలుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీర్ పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణికుమార్, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం తదితరులు ఉన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14: విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో సుప్రసిద్ధ కవి, రచయిత డాక్టర్ బిక్కి కృష్ణ రచించిన 'వాన వెలిశాక' 'మార్మిక నది', 'కాలం నది ఒడ్డున' ప్రకృతి పర్యావరణం పుస్తకాలు ఆవిష్కరించారు. ఇన్‌కంటాక్స్ రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విమల సాహితి అధ్యక్షుడు డాక్టర్ జల్దీ విద్యాధర్, ప్రసిద్ధ కవులు డాక్టర్ నాలేశ్వరం శంకరం, డాక్టర్ భీమ్ రామసుందర్రావు, డాక్టర్ కోయ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ కవయిత్రులు మంజుల సూర్య, రమాదేవి కులకర్ణి హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణ రచించిన నాలుగు పుస్తకాలు అద్భుతంగా ఉన్నాయని అన్నారు, అనంతరం ప్రముఖ కవయిత్రి డాక్టర్ రాధా కుసుమ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు అరికపూడి రఘు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కవాడిగూడ, ఫిబ్రవరి 14: స్వచ్ఛంద సంస్థలు అందించే వైద్య సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనని ఫౌండేషన్ అధ్యక్షుడు రాచకొండ మల్లేశ్ సూచించారు. జిప్స్ సహకారంతో వై ఫోర్ డి, జనని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భోలకపూర్ లోని రంగా నగర్ సెకండ్ వెంచర్ అంగన్వాడీ కమ్యూనిటీ హాల్లో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రాచకొండ మల్లేశ్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. డాక్టర్లు కార్తీక్, సురేఖ, కరుణాకర్, రాహుల్ తదితరులు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు రవికుమార్, వినోద్ కుమార్, జననీ ఫౌండేషన్ సభ్యులు అరవింద్, శ్రీనివాస్, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళులు

నివాళులర్పిస్తున్న ముఠా జయసింహ

చిక్కడపల్లి, ఫిబ్రవరి14: కాంగ్రెస్ సీనియర్ నేత గజ్జల రుషికేశ్వర్‌రావు మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, ఎర్రం శేఖర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి , ఫిబ్రవరి 14: ప్రతిఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి లోని బ్రహ్మ కుమారీస్ ఇన్చార్జి జయశ్రీ అన్నారు. బ్రహ్మ కుమారిస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో నవ జీవన అనాథ ఆశ్రమంలో శుక్రవారం పిల్లల అవసరాలను గుర్తించి నోట్ పుస్తకాలు, స్టేషనరీ ఐటమ్స్ తో పాటు తినుబండారాలు అందించారు. బ్రహ్మ కుమారిస్ సభ్యులు పాల్గొన్నారు.

17న సప్త కళాకారులకు సత్కారం

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కె.వి.రమణచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 14: జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17 న సప్త కళాకారులను సత్కరించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎల్.వి.చెన్నరావు తెలిపారు. శుక్రవారం కార్యక్రమానికి సంబంధిత కరపత్రాన్ని ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 17న త్యాగరాయ గానసభలో సినీ సంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, సంగీత నాటక అకాడమి చైర్మన్ పుంజాల ఆలేఖ్య పాల్గొననున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 14: టీఎస్ ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ టూరిస్ట్ హోటల్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు టూరిస్ట్ హోటల్ ఫీడర్ పరిధిలోని చెప్పల్ బజార్, టూరిస్ట్ హోటల్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్ రోడ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

బొల్లారం, ఫిబ్రవరి14: ఆర్థిక సమస్యలతో వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూబోయిన్ పల్లి కంసారీ బజార్ కు చెందిన కె.రాజు వివాహితుడు. ఈ నెల 11న భార్య స్వేతతో ఆర్థికపరమైన సమస్యలతో గొడవపడి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు భార్య స్వేత బంధువులను, స్నేహితులను విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

ఏఐవైఎఫ్ కౌన్సిల్ సమావేశాలు

మల్లాపూర్, ఫిబ్రవరి 14: మార్చి 1, 2 తేదీల్లో ఈసీఐఎల్‌లో జరగనున్న అఖిల భారతయువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో సమావేశాల గోడపత్రికను విడుదల చేశారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కంకణ బద్ధులై ఉండాలి

ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో 2 కె రన్‌లో పాల్గొన్న పలువురు గిరిజన నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ ఆశయాలు, లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉండాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆ దిశగా శ్రమించి బంజారా జాతిని ముందుకు నడిపే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకొని గిరిజన శక్తి ఆధ్వర్యంలో ఓయూ ఎన్సీసీ గేట్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. రన్ ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీ రవీంద్రనాయక్, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ తో కలిసి రామచంద్రనాయక్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బంజారాల అభివృద్ధికి సేవాలాల్ కృషిని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో రూపొందించాలని కోరారు. గిరిజన సమాజమంతా జ్ఞానం వైపు మరలాలని, అది విద్య ద్వారానే సాధ్యమని అభిప్రాయపడ్డారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని జిల్లాలు, యూనివర్సిటీల్లో సేవాలాల్ జయంతిని నిర్వహించేలా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. గిరిజన, ఆదివాసి సోదరులు అందరూ ఐక్యంగా నడిస్తే భవిష్యత్తులో అన్ని హక్కులను సాధించుకోవచ్చన్నారు. 2 కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి14: రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. శుక్రవారం మహ్మద్‌గూడ ప్రాంతంలో వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. కలుషిత నీరు వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆమె ఎక్కడ సమస్య ఉందో వెంటనే గుర్తించి సమస్య పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి కొరత ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నీటిని వృథా చేయకుండా ఉండాలని ఆమె కోరారు.ఎవరైనా నీటిని వృథా చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవ్య, బీఆర్ఎస్ నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార అలవాట్లు మారుతున్నయ్..

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో, ఎంటర్ ప్రిమియర్ షిఫ్ట్ ఆధ్వర్యంలో ఆహారోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగునంగా ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయని పేర్కొన్నారు. సమాజపు ఆహారపు అలవాట్లకు అనుగుణంగా విద్యార్థులు ఫుడ్ కార్నివాల్ నిర్వహించడం విశేషమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీ మాజీ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ చారి, కళాశాల డైరెక్టర్ వై.విష్ణుప్రియ, ఫుడ్ కార్నివాల్ ఫాకల్టీ కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించారు.

ఐక్యంగా పండుగలు జరుపుకోవాలి

ఏసీపీ రమేశ్ కుమార్, పోలీసు అధికారులతో స్థానికులు

కవాడిగూడ, ఫిబ్రవరి 14: అన్నివర్గాల ప్రజలు పండుగలు ఐక్యంగా జరుపుకొంటూ మతసామరస్యాన్ని కాపాడాలని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ అన్నారు. షబ్ ఏ బరాత్ పండుగ సందర్భంగా శుక్రవారం భోలకపూర్ బడీ మజీద్, బిలాల్ మసీదుల వద్ద బందోబస్తు నిర్వహించిన ఏసీపీ రమేశ్ కుమార్, సీఐ రాంబాబు, ఎస్సై ప్రేమ్ కుమార్ ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లాక్ హుస్సేన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు అల్లావుద్దీన్, నూర్ హుస్సేన్, ఇక్బాల్ అహ్మద్, షఫీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వ.. కేసు నమోదు

చర్లపల్లి, ఫిబ్రవరి 14: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతరులకు అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కాప్రా సర్కిల్ పరిధిలోని మాధవపురి కాలనీకి చెందిన నీలపు అప్పన్న(53) గత కొంత కాలంగా కుషాయిగూడ చక్రీపురం చౌరస్తాలో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి ఒయాటీ కాలనీలో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఇసుక నిల్వ దగ్గర దాడి చేసి 14 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను నిల్వ చేసిన అప్పన్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 14: టీఎస్ ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11 కేవీ టూరిస్ట్ హోటల్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు టూరిస్ట్ హోటల్ ఫీడర్ పరిధిలోని చెప్పల్ బజార్, టూరిస్ట్ హోటల్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్ రోడ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కత్తితో బెదిరించి..

మల్కాజిగిరి, ఫిబ్రవరి 14: కత్తితో బెదిరించిన ఒకరిపై కేసు నమోదైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. మౌలాలి ముస్లింజంగ్ కాలనీలో ముక్రం అలియస్ పప్పు రోడ్డుకు అడ్డంగా నిలబడి అటుగా వెళ్తున్న వారిని కత్తితో బెదిరించాడు. మొహమ్మద్ అమీ నుద్దీన్, మోసిన్, సల్మాన్, బాబర్‌లను కావాలని ఆపి ముక్రం అలియాస్ పప్పు బూతులు తిడుతూ చాకుతో వారిని బెదిరించాడు. వీరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రముఖ రచయిత, సామాజిక సేవకురాలు డాక్టర్ లక్కరాజు నిర్మల రచించిన 'మా అమెరికా పర్యటన' పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓయూ తెలుగు విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ బాగయ్య మాట్లాడుతూ పుస్తకం గురించి వివరించారు. పుస్తకం రాయడం, దానిని ప్రచురించడం కష్టతరమైన ఈ రోజుల్లో చక్కటి పుస్తకాన్ని తీసుకువచ్చి అందరికీ అందుబాటులో తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాన్ని ప్రశంసించారు. ఈ రచన అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పుస్తకం ఆసాంతం చాలా సులభతరమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా ఉందని చెప్పారు. అనంతరం పుస్తక తొలి ప్రతిని నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీశ్‌శర్మ, కొండపల్లి నరసింహారావు, రేణుకా పతి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ:

జాబ్ మేళాకు విశేష స్పందన

బేగంపేట్, ఫిబ్రవరి 14: ప్రపంచ వ్యాప్తంగా ఆతిథ్య రంగంలో ఉద్యోగ అవకాశాలను కల్పించడం కోసం శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆతిథ్య మేళా జోబోథాన్-2025కు స్పందన లభించింది. బేగంపేటలోని ఇనిస్టిట్యూట్ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, శ్రీశక్తి కళాశాలల ఆధ్వర్యంలో బేగంపేటలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు అతిథ్య రంగం, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. మేళాకు టీజీఎస్సీహెచ్ఐ కార్యదర్శి, ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ మేళాలో సుమారు 25 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయని, అర్హులైన విద్యార్థులను ఉద్యోగాల కోసం ఎంపిక చేశాయని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిక్యుటీవ్ డైరెక్టర్ సత్య పింజల, డైరెక్టర్ యమునా రంగారావు, ప్రిన్సిపాల్ అనిత చంద్రన్ తదితరులు మేళాను పర్యవేక్షించారు.

ఇంటర్వ్యూలకు హాజరైన ఉద్యోగార్థులు